

బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## మూడోసారి సీఎంగా కేసీఆర్ : ఎమ్మెల్యే

కల్వకుర్తి, అక్టోబర్ 20 : ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన 200మంది కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మార్చాల గ్రామానికి చెందిన 50మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోని చూసి ప్రతిపక్ష పార్టీల కండ్లు బైర్లు కమ్మాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్ స్థాయిలో నిలిచిందని, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అనునిత్యం శ్రమిస్తున్న తనకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. అన్ని వర్గాల ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల గారడి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన సీఎం కేసీఆర్‌కు అండగా ఉండామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, మధు, బోజిరెడ్డి, హరిదాస్, సాయన్న, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు

కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 20: కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో శక్రవారం వైద్య సిబ్బంది బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది తీరొక్క పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దసర నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బతుకమ్మల పేర్చి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా బతుకమ్మ పండగ నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

కల్వకుర్తి, అక్టోబర్ 20 : కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో శుక్రవారం విజేతలకు జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేశ్‌బాబు బహుమతులు అందజేశారు. దాదాపు 50 మంది మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారు చేశారు. అందమైన బతుకమ్మలను తయారు చేసిన వారిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రమేశ్‌బాబు

# సరస్వతీదేవీగా అమ్మవారు

- అమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కల్వకుర్తి, అక్టోబర్ 20 : దేవీశరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాయలంలో వాసవీమాత సరస్వతీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వాసవీమాతను ఉదయాన్నే సుప్రభాతంలో మేల్కొలిపి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీ దేవీగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి వడి బియ్యం పోశారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని కల్వకుర్తి ఎమ్మెల్యే , బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఉత్సవాలలో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సక కమిటీ ఆధ్వర్యంలో భజనలు, బతుకమ్మలు, దాండియా ఆటలు ఆడారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపీపీ గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, ఆర్య వైశ్య సంఘ నాయకులు రమేశ్, శ్రీధర్, అశోక్, రాఘవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

### వివిధ గ్రామాల్లో..

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 20 : కల్వకుర్తి మండలంలోని మార్చాల, తర్నికల్, కుర్మిద్ద, జీడిపల్లి, గుండూర్, లింగసానిపల్లి గ్రామాలతోపాటు కల్వకుర్తి పట్టణంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, పెద్దమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాల వద్ద దేవీ శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు సరస్వతీమాత అలంకరణలో దర్శనమిచ్చారు. తర్నికల్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. దాత బీరయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం వేళ అమ్మవారి మండపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని బతుకమ్మ, కోలాటం ఆటాపాటలతో సందడి చేస్తున్నారు.

### కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

చారకొండ, అక్టోబర్ 20 : అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు మండలకేంద్రంతోపాటు జూపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి తదితర గ్రామాల్లో కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక మండపంలో విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండపాల వద్ద మహిళలు బతుకమ్మ, కోలాటం, ఆటాపాటలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో యువజన సంఘం ప్రతినిధులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల ప్రత్యేక పూజలు

వెల్దండ, అక్టోబర్ 20 : మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారు సరస్వతీ మాత అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా బుధార్‌పేట ఆంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద జై శ్రీరాం యూత్ అమ్మవారికి పలువురు భక్తులు పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరాంయూత్ సభ్యులు శ్రీశైలం యాదవ్, విష్ణుగౌడ్, దేవేందర్, అరుణ్‌కుమార్, రాజు, శ్రీను, రఘు, మల్లేశ్, లక్ష్మయ్య, దీపక్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు వజ్రలింగం, పూరి రమేశ్, బికుమండ్ల శ్రీను, కుమారస్వామి, పాలాది సంతోష్, సైదులు, కిరణ్, ఆంజనేయులు, రాజయ్య, శ్రీను, కృష్ణ, అనిల్‌తోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పూజందుకుంటున్న అమ్మవారు

ఊర్కొండ, అక్టోబర్ 20 : దేవీశరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారు నిత్యపూజలందుకుంటున్నారు. మండలంలోని మాదారంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని శుక్రవారం సరస్వతీదేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి నోటు బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్వాల్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, జంగయ్యగౌడ్, నేతాజీ యువజన సంఘం నాయకులు బోల్గం దివాకర్ గౌడ్, యశ్వంత్‌గౌడ్, ఆకాశ్ తందితరులు పాల్గొన్నారు.



చారకొండలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



సరస్వతీ మాత అలంకారంలో అమ్మవారు



తర్నికల్ గ్రామంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

## చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

వెల్దండ, అక్టోబర్ 20 : యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేస్లీతండా సర్పంచ్ బుజ్జీ, బీ ఆర్ఎస్ నాయకుడు, బీఎంసీయూ అధ్యక్షుడు శ్రీనూనాయక్ పేర్కొన్నారు. వెల్దండ మండలం కేస్లీతండాలో దసరా పండుగను పురస్కరించుకొని తుల్జాభవానీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తాలుకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భం గా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ అవకాశం లభిస్తుందని వివరించారు. అనంతరం మొదటి విజేతకు రూ. 20వేలు, రెండో విజేతకు రూ. 10వేలు నగదుతో పాటు షీల్డ్‌లు అందజేశారు. అదే విధంగా మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్ రూ. 2వేలు , మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.500 అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, కేస్లీతండా యూత్ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ బుజ్జి, శ్రీనూనాయక్

## గోకారంలో రూ.4.75లక్షల మద్యం పట్టివేత

చారకొండ, అక్టోబర్ 20 : మండలంలోని గోకారంలో భారీ మద్యం నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారంతో గురువారం అర్ధరాత్రి ఎన్నికల ఫ్లయింగ్ స్కాండ్ టీం దేవన్న, చారకొండ ఎస్సై రవి ఆధ్వర్యంలో దాడులు చేసి భారీ మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఎస్సై రవి తెలిపిన కథనం ప్రకారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోకారం గ్రామానికి చెందిన బాదగోని బక్కయ్య ఇంట్లో మద్యం కాటన్లు ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు చెప్పారు.దాడులు నిర్వహించగా ఇంట్లో 50 కాటన్ల బాటీళ్ల మద్యం, 432 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 4లక్షల 75 వేలు ఉంటుందని చెప్పారు.మద్యం కాటన్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచిన్నట్లు చెప్పారు. ఓటర్లకు ప్రలోభపెట్టే మద్యం, నగదు, వస్తువులు అక్రమంగా తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గోకారంలో పట్టుబడిన మద్యం కాటన్లు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఊర్కొండ, అక్టోబర్ 20 : ఊర్కొండ గ్రామానికి చెందిన నేరల్లపల్లి బాల మైశయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము రాజయ్య ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా కరాటే, కబడ్డీ సంఘాల అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం పంపించారు. దీంతో రాజయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించి జనార్దన్‌రెడ్డి పంపిన రూ.5వేలతోపాటు తాను రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కోఆప్షన్ సభ్యుడు కలీంపాషా, కొమ్ము శ్రీను, సందీప్‌కుమార్, రాచకొండ గోపి, మల్లేశ్, నారాయణతోపాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.